క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ

పెద్దకడబూరు : ఎంపీడీఓ శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లాలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఈయన ప్రమోషన్‌పై వచ్చారు.స్థానిక కార్యాలయంలో విధుల్లో చేరిన అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తారనని చెప్పారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆదోని రూరల్ : ఉపాధి హామీ పథకం కూలీలకు పెండింగ్‌లో ఉన్న 8 వారాల వేతనం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న, మండల నాయకుడు కె.గోవిందు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గోనబావి, పాండవగల్లు గ్రామాల్లో ఉపాధి కూలీలతో కలిసి పని ప్రదేశంలో నిరసన తెలిపారు. నాయకులు, కూలీలు మాట్లాడుతూ పనులను సక్రమంగా చేస్తున్నా వేతనాలుఅందించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు.

ఆలయ జీర్ణోద్ధరణకు భూమిపూజ

కోసిగి: మండలంలోని సజ్జలగుడ్డం గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు పి.మురళీమోహన్ రెడ్డి బుధవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి నియోజకవర్గంలో 31 దేవాలయాల అభివృద్ధికి రూ.3.10 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇందులో మండలంలో 18 పురాతన దేవాలయాలను ఎంపిక చేశారు. ఒక్కో దేవాలయానికి రూ.10లక్షలు టీటీడీ వారు కేటాయించారని చెప్పారు. సర్పంచ్ జేకె. నరసమ్మ, నాయకులు జేకె. మల్లయ్య, జె.రుద్రప్ప, మూకప్ప, హనుమంతు రెడ్డి, తిమ్మప్ప పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని అర్బన్ : అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఆదోని వన్‌టౌన్ సీఐ విక్రమసింహ బుధవారం తెలిపారు. పట్టణంలోని నామాలకొండ వద్ద సిబ్బంది సాయంతో వాహనాల తనిఖీ చేస్తుండగా బోయ గేరికి చెందిన రాజేష్, వాల్మీకి నగర్‌కి చెందిన బోయ శీను అలియాస్ చిన్నా, బోయగేరికి చెందిన సూర్య బ్యాగుల్లో 10 బాక్సుల కర్ణాటక మద్యాన్ని ఏపీ21ఎఫ్ 6763 నంబర్ గల బైక్, ఏపీ21ఎఫ్ 5835 నంబర్ గల మోటార్ సైకిళ్లపై పట్టణంలోకి తీసుకొస్తుండగా అదుపులోకి తీసుకొని 90 ఎం.ఎల్. పరిమాణం గల 960 ఒరిజనల్ ఛాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనట్లు చెప్పారు.

అర్హులకు పథకాలు అందాలి

కౌతాళం: గ్రామాల్లోని అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని మండల సచివాలయ కన్వీనర్ వెంకట్రామిరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ఏరిగేరి, తోవి గ్రామాల్లో జగనన్న సురక్ష పథకంపై గ్రామ వలంటీర్లు, గృహ సారథులు కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

సమస్యలకు చెక్

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ పథకాలు అందడమే కాకుండా సమస్యలన్నీ పరిష్కారమవుతాయని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రమణకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వల్లూరు, కుంబళనూరు క్యాంపు-2 గ్రామాల్లో పర్యటిం సమస్యల్ని అడిగి తెలుసుకుని వలంటీర్ల ద్వారా యాప్‌లో అప్‌లోడ్ చేయించారు.

మంత్రాలయం : మండలంలోని మాలపల్లి, సుంకేశ్వరి, సోళ్లహళ్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాఘవేంద్రచారి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.


జయప్రదం చేయండి

ఆదోని రూరల్ : పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన విద్యుత్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నాయకుల సమావేశం నిర్వహించారు.

వర్గీకరణ సాధించే వరకు ఉద్యమం

కోసిగి: ఎస్సీ వర్గీకరణ సాధించేంత వరకు ఉద్యమం ఆగదని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ అన్నారు. బుధవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు.

విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది జగన్ ప్రభుత్వమే



మాట్లాడుతున్న కట్టిపోగు బసవరాజు

మంత్రాలయం రూరల్: రాష్ట్రంలో పేదల విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టిపోగు బసవరాజు పేర్కొన్నారు. మండలంలోని వి.తిమ్మాపురం గ్రామంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు చిక్కం జానయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సర్పంచ్ వీరారెడ్డి, మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, తహసీల్దార్ దేవ చంద్రశేఖర్, ఎంపీడీఓ మణిమంజరి, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజుతో కలిసి ఆవిష్కరించారు. దళితుల అభివృద్ధికి సీఎం ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. కానిస్టేబుల్‌గా ఉన్న తనకు ఎస్సీ కమిషన్ సభ్యుడిగా అవకాశం కల్పించారని తెలిపారు.

అమ్మ ఒడి.. భవితకు అండ

- 34,379 మంది తల్లుల ఖాతాలో పథకం సొమ్ము జమ
- రూ.13 వేలు చొప్పున రూ.44.67 కోట్లు జమ

మంత్రాలయం : జగనన్న అమ్మ ఒడి పథకం పేద తల్లుల మది నిండా వెలుగులు నింపుతోంది. పిల్లల చదువుకు బాసటగా నిలిచి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. విద్యాకానుక పేరుతో యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, బూట్లు తదితర సామగ్రి అందజేయడమే కాకుండా అమ్మ ఒడి పేరుతో తల్లులకు భారం కాకుండా సొమ్ములిచ్చి పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవడంతో పేదింటి తల్లులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్లుగా అమ్మ ఒడితో వారి ఆనందానికి అవధుల్లేవు.

నియోజకవర్గంలో 34,379 మందికి లబ్ధి..

మంత్రాలయం నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 225 ఉన్నాయి. వీటిల్లో 58,159 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 1వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు



కార్యక్రమంలో పాల్గొన్న పెద్దకడబూరు మండల విద్యార్థులు

అమ్మ ఒడి ద్వారా రూ.15 వేలు చొప్పున ఏటా తల్లుల ఖాతాలో జమ చేస్తున్నారు. మొదటి ఏడాది రూ.15 వేలు, రెండో ఏడాది రూ.14 వేలు, గతేడాది, ఈ ఏడాది రూ.13 వేలు చొప్పున పంపిణీ చేశారు. ఈ ఏడాది మొత్తం 34,379 మంది తల్లుల బ్యాంక్ ఖాతాల్లో రూ.44.67 కోట్లు జమ చేశా. పాఠశాలల, మరుగుదొడ్ల నిర్వహణ కోసం ఈఏడాది రూ.2 వేలు చొప్పున కేటాయించారు. పాఠశాలల నిర్వహణకు పెద్దకడబూరు మండలానికి రూ.1,55,98,000, కోసిగికి రూ.1,86,82,000, కౌతాళం మండలానికి రూ.1,89,64,000, మంత్రాలయం మండలానికి రూ.1,55,50,000 జమ చేస్తారు.

మండలాల వారీగా అమ్మ ఒడి వివరాలు..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	లబ్ధిదారులు	జమ అయిన మొత్తం (రూ.13 వేలు చొప్పున)
పెద్దకడబూరు	48	12395	7799	10,13,87,000
కౌతాళం	62	15800	9464	12,30,32,000
కోసిగి	55	15464	9341	12,14,33,000
మంత్రాలయం	60	14500	7775	10,10,75,000
మొత్తం	225	58,159	34,379	44,69,27,000

జగనన్నకు రుణపడి ఉంటాం



రోజు వారి కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలను ప్రభుత్వ బడికి పంపుతున్నాం. అమ్మ ఒడి కింద రెండేళ్లుగా రూ.13వేలు చొప్పున వచ్చాయి. ఈ మొత్తం మా పిల్లల చదువుకు ఎంతగానో ఉపయోగ పడుతోంది. జగనన్నకు తమలాంటి పేద అమ్మలు రుణపడి ఉంటాం. **– బోయ ఉరుకుందమ్మ , మేకడోణ**

చాలా సంతోషంగా ఉంది



వరుసగా మూడో ఏడాది కూడా అమ్మ ఒడి కింద డబ్బులు వచ్చాయి. నా కుమార్తె పత్రోల గీతాంజలి ప్రభుత్వ బడిలో మూడో తరగతి చదువుతుంది. మాలాంటి పిల్లల చదువుకు అమ్మ ఒడి ఎంతో ధైర్యాన్నిచ్చింది. సీఎం జగనన్న మాకు అండగా ఉండడం చాలా సంతోషంగా ఉంది. మా పిల్లలను బాగా చదివించుకుంటాం. **– పార్వతి, కోసిగి**

పిల్లల చదువు కష్టాలు తీరుతున్నాయి



నా భర్త నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. నాకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కూలీ పనులకు వెళ్లి పిల్లలను పోషించుకుంటున్నా. భర్త చనిపోతే పిల్లలు చదివించుకోవడం కష్టం అనుకున్నాను. అలాంటి తరుణంలో సీఎం జగనన్న అమలు చేస్తున్న అమ్మఒడి పథకం పిల్లల చదువుకు ఆసరాగా నిలిచింది. విద్యాకానుక, అమ్మ ఒడి సొమ్ము తమలాంటి ఒంటరి మహిళల పిల్లలకు అండగా ఉంటుంది. **– జంగిలి రామాంజినమ్మ, కోసిగి**

పథకాలను ప్రజలే మెచ్చుకుంటున్నారు

- ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి
- పెద్దహరివాణంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆదోని రూరల్ : అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు మెచ్చుకుంటున్నారని, ఇన్ని పథకాలు, ఇంత లబ్ధి, ఇలాంటి పాలన తాము ఇంతకు ముందు చూడలేదని హర్షం వ్యక్తం చేస్తున్నారని, అయితే ప్రతిపక్షాలు మాత్రం ఓర్వలేక, రాజకీయ మనుగడ కోల్పోతామని ఆరోపణలు గుప్పిస్తున్నాయని ఎమ్మెల్యే సాయప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు గజమాలలు, పూలమాలలతో స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల గురించి, చేకూరిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఏకైక సీఎంగా జగనన్న కొత్త చరిత్ర సృష్టించారన్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మరో సారి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎంపీపీ బడాయి దానమ్మ, మాజీ ఎంపీపీ పంపాపతి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మ ప్ప, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, పీఆర్ ఏఈ మాలిక్ బాషా, ఏపీఓ చంద్రశేఖర్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కర్రెప్ప, మెడికల్ నాగరాజు, సున్నుబాషా, శ్రీలక్ష్మి, రేణుక, సర్పంచ్ రాముడు, వైస్ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.



స్థానికుడి సమస్యను వింటున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఉర్దూ బాలుర పాఠశాల తరలింపు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని అండర్‌పేట్‌లోనున్న ఉర్దూ పురపాలక బాలుర ప్రాథమిక పాఠశాలను మైనార్టీ కాలనీలోకి తరలిస్తున్నట్లు ఎంఈఓ బి.శివరాములు బుధవారం తెలిపారు. అండర్‌పేట్ ఉర్దూ పురపాలక బాయ్స్ ప్రాథమిక పాఠశాల, అండర్ పేట్ ఉర్దూ బాలికల పురపాలక ప్రాథమిక పాఠశాలలు ఒకే భవనంలో ఉన్నాయని, పురపాలక పాఠశాలలో 30 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. బాలికల పాఠశాలలో 42 మంది విద్యార్థినులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. మైనార్టీకాలనీలో పాఠశాలను ఏర్పాటు చేయాలని కొంత కాలంగా కాలనీవాసులు కోరుతున్న విషయాన్ని డీఈఓ రంగారెడ్డికి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఒకటి ఆ కాలనీకి తరలించాలని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అక్కడ ఉన్న పిల్లలను అండర్‌పేట బాలికల పాఠశాలలో సర్దుబాటు చేస్తామని చెప్పారు.

వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందిస్తాం

- బకాయిలు చెల్లించి సహకరించండి
- విద్యుత్ అధికారులు స్థానికంగానే నివాసం ఉండాలి
- ఎస్ఈ ఉమాపతి

పెద్దకడబూరు: జిల్లాలో అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్‌ను అందిస్తామని ఎస్ఈ ఉమాపతి పేర్కొన్నారు. బిల్లుల వసూలులో భాగంగా బుధవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది స్థానికంగానే ఉంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎవరికైనా పనిభారమై విధుల్లో నిర్లక్ష్యంగా వహిస్తున్నట్లు అయితే ఇంటికి వెళ్లిపోవాలని సూచించారు. సిబ్బంది బాధ్యతగా పని చేయాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు పగటిపూటనే 9గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని చెప్పారు. రైతులు గతంలోలాగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం వేచిచూడాల్సిన అవసరం లేదన్నారు. డీడీ చెల్లించిన నెల రోజుల్లోపే ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను అందజేస్తామన్నారు. ఎస్సీలు 200యూనిట్లుకు పైగా వినియోగిస్తే బిల్లు చెల్లించాలని స్పష్టం చేశారు.



పెద్దకడబూరు సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈ ఉమాపతి

బకాయిలు చెల్లించాలి..

ఉమ్మడి జిల్లాలో బోరుబావుల బిల్లులు రూ.1.70కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. ఇళ్లకు సంబంధించి రూ. 3.2కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. హంద్రీనీవా కింద రూ.2500 కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉండగా ఇటీవల రూ.వెయ్యి కోట్లు రికవరీ చేశామన్నారు. అలాగే గురురాఘవేంద్ర ప్రాజెక్టు కింద రూ.350 కోట్లు పెండింగ్ ఉండగా రూ. వంద కోట్లు వసూలు చేశామని చెప్పారు. వినియోగదారులు బిల్లులను క్రమం తప్పకుండా చెల్లించాలని కోరారు. ఏఈ నాగవేంద్రం, సిబ్బంది ఉన్నారు.

వెనుకబడిన ప్రాంతాలను గుర్తిండం సంతోషకరం



మాట్లాడుతున్న వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు : నార్మ్ సంస్థ వారు వెనకబడిన ప్రాంతాలను గుర్తించి అందులో ఎస్సీ రైతులకు వ్యవసాయ ఉపకరణాలు అందించడం సంతోషకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి తెలిపారు. జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ (నార్మ్) రాజేంద్రనగర్ హైదరాబాద్, కర్నూల్ జిల్లా వ్యవసాయ శాఖ తరపున ఎస్సీ సబ్‌ప్లాన్ 2022-23 పథకం కింద మండల కేంద్రానికి చెందిన 323 మంది ఎస్సీ రైతులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుదవారం వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వై.ప్రదీప్‌రెడ్డి మాటాడారు. నార్మ్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రమేష్ నాయక్ మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మండలంలోని 323 మంది ఎస్సీ రైతులకు ఒక్కొక్కరికి దాదాపు రూ.7వేలకు మించిన వ్యవసాయ పనిముట్లు ఉచితంగా అందజేశామన్నారు. నార్మ్ చీఫ్ టెక్నికల్ అధికారులు డాక్టర్ విజయేంద్రరెడ్డి, శేఖర్‌రెడ్డి, నాందేవ్, జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి, ఆదోని సహాయ వ్యవసాయ సంచాలకులు యం.గిరీష్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి యం.వరప్రసాద్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకనే బురద జల్లుతున్న టీడీపీ

ఆదోని టౌన్ : టీడీపీ హయాంలో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని, ప్రస్తుతం జగనన్న చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే టీడీపీ నాయకులు బురదజల్లే రాజకీయాలకు తెరతీశారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నాడు ప్రజా సంక్షేమాన్ని విస్మరించినందునే ప్రజలు మిమల్ని విస్మరించారని ఎద్దేవా చేశారు. బుధవారం పట్టణంలోని 36వ వార్డు టీజీఎల్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ సందీప్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందజేసిన పథకాలు, పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేసి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కారం కాని సమస్యలు ఏవైనా ఉంటే తమకు తెలియజేయాలని ప్రజకు సూచించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ కేవలం అధికారం కోసమే ప్రజలను మభ్యపెడుతుందని, మోసపోరాదని ప్రజలను కోరారు. గతంలో ఇన్ని పథకాలు, ఇంత పెద్ద లబ్ధి, ఇలాంటి పారదర్శక పాలన గతంలో అందిందా అని ప్రజలను ప్రశ్నించినా లేదని వారు ముక్తకంఠంతో సమాధానమిచ్చారు. ఈ పాలన, పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవ, కౌన్సిలర్లు ఫయాజ్, నరసింహులు, దుర్గప్ప, బాలాజీ, మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్‌సునార్‌ఖాదర్, నాయకులు అమాన్, నల్లారెడ్డి, గోవిందు, అశోక్, నాగరాజ్, సింహం నాగేంద్ర, యేసేబు, ఫర్హద్, లక్ష్మన్న, ఏఈ సంతోష్, శ్రీనివాసరెడ్డి, సన్ని, రాజేశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



టీజీఎల్ కాలనీలో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కోసిగి: స్థానిక 1వ వార్డులో నివాసం ఉంటున్న పెండేకంటి పెద్ద వీరేష్ స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పీహెచ్‌సీ కి తీసుకెళ్లగా వైద్యులు ఆదోనికి రెఫర్ చేశారు.

అడిగిన వారందరికీ 'ఉపాధి'

మంత్రాలయం: మండలంలో ఉపాధి పనికి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని 52బసాపురంలో జరుగుతున్న పనులను పరిశీలించారు.

బెంగళూరుకు వెళ్లి ఈ-కేవైసీ

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామానికి చెందిన సురేష్ అనే వలంటీర్ బెంగళూరు పట్టణానికి వెళ్లి ఈ-కేవైసీ చేయించారు. అమ్మ ఒడి పథకానికి అర్హులైన 20 కుటుంబాలు బెంగళూరుకు బతుకుదెరువు కోసం వెళ్లారు. వలంటీర్ అక్కడి వెళ్లి వారితో బుధవారం ఈ -కేవైసీ చేయించారు.

ఉపాధ్యాయిని పట్ల అసభ్య ప్రవర్తన

కోసిగి: స్థానిక ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయిని పట్ల స్థానికంగా ఉంటున్న దిల్‌వర్ వలి అనే వ్యక్తి బుధవారం అసభ్యకరంగా ప్రవర్తించినట్లు స్థానికులు తెలిపారు. టీచర్‌పై వికృత చేష్టలు చేసినట్లు తెలిసింది. దీంతో ఆమె బాధపడుతూ ఓ వాహనంలో వెళ్లిపోయింది. అయితే దిల్‌వర్‌వలికి మతిస్థిమితం సరిగా లేదని తెలిసింది. ఈ విషయంపై ఎస్ఐ రాజారెడ్డి విచారించగా తమకు ఫిర్యాదు అందలేదని చెప్పారు.

పనుల పరిశీలన

ఆదోని టౌన్ : రాంజల రోడ్డులోనున్న పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు.

మత్తు పదార్థాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టండి

ఆదోని రూరల్ : మత్తు పదార్థాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. బుధవారం రాత్రి తన కార్యాలయంలో మత్తుపదార్థాల నియంత్రణపై ఆదోని డీఎస్పీ శివనారాయణ, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్యతో సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా వాటికి అలవాటైన వారిని కుటుంబ డాక్టర్ విధానం ద్వారా ఇంటింటికీ వైద్యం అందజేయాలన్నారు. మండలస్థాయిలో కూడా సమీక్ష సమావేశాలు నిర్వహించుకొని వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేట్ వాహనాల ద్వారా మత్తు పదార్థాల రవాణా జరిగే అవకాశం ఉందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే బస్సుల్లో పార్శిల్ సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పాఠశాలలు, కళాశాలలు, సచివాలయాల్లో మత్తుపదార్థాల వాడకం వల్ల జరిగే అనర్థాలను సూచిస్తూ బ్యానర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎక్కువశాతం ఇతర ప్రాంతాల నుంచి భవన నిర్మాణ పనులకు వచ్చే వారే మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, వారికి కూడా వాటిపై అవగాహన కల్పించాలన్నారు. పోలీసులు గ్రామాల్లో పల్లెనిద్రకు వెళ్లినప్పుడు గ్రామస్తులకు అవగాహన కల్పించాలని చెప్పారు. బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఎక్కువ శాతం యువత మత్తు పదార్థాలు వినియోగిస్తున్నారని, వారిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ షాపుల్లో ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మత్తు మందులు అందజేసేలా చూడాలని కోరారు. వైట్‌నర్ అమ్మే స్టేషనరీ షాపుల్లో ఎంత మేర కొన్నారు, అమ్మకాలు జరిగాయి తదితర వివరాలను పరిశీలించేందుకు డివిజన్ స్థాయిలో మున్సిపల్ కమిషనర్, మండల స్థాయిలో ఎంపీడీఓలు స్టేషనరీ షాపుల యజమానుల నుంచి వివరాలు సేకరించాలని ఆదేశించారు.



డీఎస్పీలతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

పరామర్శ

ఆదోని రూరల్ : మండిగిరిలో నివాసముంటున్న ఆటో డ్రైవర్ శంకర్ ఇటీవల దారుణ హత్యకు గురైన విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజ్, కర్నూలు జిల్లా ఎంఎస్‌పీ సుభాష్‌చంద్ర బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారు మాట్లాడుతూ మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.